# 6

## త్రిభువనస్వామి

"పిరాళ్ళుగాని నాచుట్టుగుడిసె దరిమానానికి వచ్చారంటే, మరి నే నింక ఊరుకునేదిలేదు! తెలిసిందా?....ఇదిగో, గండ్రగొడ్డలి! చూశారా?"

మంకణుడు తన పక్కనే ఉన్న గండ్రగొడ్డలి చేతబట్టి పైకెత్తి ఒళ్ళెరగని ఆవేశంతో రాజభటులమీదికి లంఘించాడు! దానితో, ఏడెనమండుగురుదాకా ఉన్నా, వారి కిక కాలికి బుద్ధి చెప్పక తప్పలేదు!

ఆ రాజభటులలో కొందరు మంకణుని కుటీరంచుట్టు ఉన్న ప్రదేశంలో కొంతభాగం గునపాలతో తవ్వి, పొడుగాటి కర్రలతో, తాళ్ళతో కొలిచి లెక్కలు కడుతున్నారు. అంతలోనే గుడిసెలోనించి అకస్మాత్తుగా ఇవతలికి వచ్చి, అత డా విధంగా విరుచుకుపడేసరికి, వారిలో ఒకడు అల్లంతదూరంలో నిలిచి ఆ పనులన్ని చేయిస్తున్న ప్రధాన రాజాధికారి పద్మస్వామి కా వృత్తాంతం నివేదించాడు.

మంకణుడు శ్రీనగరం పివారులలో చెప్పులు కుట్టుకుని జీవిస్తున్న చర్మకారుల కులానికి చెందిన మాల. అతగాడికి ఉన్న ఆస్తి అంతా ఒక్క చుట్టుగుడిసె మాత్రమే! చేస్తున్న పనిపాటులవల్ల అతనికి ఆపూట గడవడంకూడా కష్టమే! అటువంటివాడు అసహాయశూరుడై గండ్రగొడ్డలి చేతబట్టి రాజభటులందరిమీదికి కయ్యానికి కాలుదువ్వుతున్నాడు! 'వీడి కెంత తలపొగరు! కండకావరము!' ఆశ్చర్యపోయాడు పద్మస్వామి.

అయినా తొందరపాటు పనికిరాదని నెమ్మదిగా అతనిని సమీపించి, చల్లని మాటలతో బుజ్జగించాడు.

"మంకణా, ఎందుకలాగ తొందరపడిపోతావు? మహామాత్యుల ఆజ్ఞ ప్రకారమే మేమిక్కడికి వచ్చి ఈ పనిని ప్రారంభించాము. నీ గుడిసె ఉన్న ప్రాంతమే దేవాలయ నిర్మాణాని కన్నివిధాల తగినదని రాజశిల్పులందరు ఏకగ్రీవంగా నిర్ణయించారు."

"అయితేమాత్రం? నాతో చెప్పాపెట్టకుండా, నా వాకిట్లో అడుగుపెట్టడానికి మీ కెవ్వరిచ్చా రీ అధికారం?....అడుగు ముందుకు వేశారంటే మరి ప్రాణాలు దక్కవు! జాగ్రత్త!"

ఆ సమాధానంతో పద్మస్వామికి దురాగ్రహం తల కెక్కింది. అయినా ఎలాగో అలాగ పని జరిపించుకుపోవడం మంచిదని ఆలోచించి కొంచెం తమాయించుకున్నాడు.

"ఇదిగో, ఇలాగ చూడు! నీ అంతరువు, పైవారి అంతరువు గమనించుకోకుండా ఊరికే ఉత్త పుణ్యానికని ఎందు కలాగ కారాలు మిరియాలు నూరుతావు? స్వయంగా చంద్రాపీడ సార్వభౌములే ఈ ప్రదేశంలో త్రిభువనస్వామి అన్న విష్ణుదైవతం దేవాలయంనిర్మించాలని నిశ్చయించుకున్నారు! చక్రవర్తి, మహామాత్యులు ఆజ్ఞాపించనిదే మేమిక్కడికి వచ్చి, ఇలాగ ఈనేలకొలత లారంభిస్తామనుకున్నావా? అదీగాక నీకేదో తగినంత ప్రతిఫలంముట్టజెప్పనిదే వారు మాత్రం నీ గుడిసె తీయించివేస్తారనుకున్నావా?"........నామాట విని కొంచెం ఆలోచించుకో!"

అయినా మంకణు డా ప్రధాన రాజాధికారి మాట బొత్తిగా చెవికెక్కనియ్యలేదు! చేతనున్న గండ్రగొడ్డలితో బెదిరిస్తూ "వెంటనే ఇక్కడినించి వెళ్ళిపోకపోతే మరి మాట దక్క" దని వారందరివైపు తిరిగి గొంతెత్తి గర్జించాడు! పద్మస్వామి ఆపైన అతని దురహంకారం భరించలేకపోయాడు.

రాజభటులవైపు తిరిగి శీఘ్రంగా మంకణుని నిర్బంధించి, గొడ్డళ్ళతో, గునపాలతో ఆ గుడిసె పడగొట్టి నేలమట్టం చెయ్యవలసినదని ఎలుగెత్తి హుంకరించాడు! వెనువెంటనే వారందరు కత్తు

లతో, కటారులతో ముమ్మందుగా మంకణునిమీదికి లంఘించారు!

అయినా అత డేమాత్రము చలించలేదు! తన గండ్రగొడ్డలి గిరగిర తిప్పుతూ, కళ్ళు మూసుకుని ముమ్మందుకురికి వారి నెదుర్కొన్నాడు! ఆ ఘోరాపద గమనించి, ఆ గుడిసెలో వేరొకగదిలో ఒకమూల నక్కికూర్చున్న మంకణుని ఇల్లాలు, నలుగురు పసిపిల్లలు గొంతెత్తి దీనాక్రందనా లారంభించారు.

అంతలోనే తాను తలపెట్టిన వ్యవహారం శ్రుతిమించి రాగాన పడుతున్నదని పద్మస్వామి భయపడ్డాడు. ఆ పరిసరంలో నేల అంతా జాగ్రత్తగా కొలిచి, దేవాలయనిర్మాణంలో సుళువు బరువు లెరిగించవలసిందని మాత్రమే మహామంత్రి శ్రుతకీర్తి ఆజ్ఞాపించాడు. అంతేగాని, పని కొనసాగకపోతే, మంకణునిమీదికి రాజభటుల నుసికొలుపవలసిందని అత డాదేశించలేదు. ఒకవేళ వారి తొందరపాటువల్ల మంకణునికి ప్రాణాపాయమే సంభవిస్తే?...ఆ వ్యవహారం అంతా తలకిందులై చాలాదూరందాకా వెళ్ళిపోతుంది!

కనక వెంటనే వెనక్కి తగ్గిపోవలసిందని మరుక్షణంలోనే రాజభటుల కాజ్ఞాపించాడు. మందలింపులతో మంకణునికికూడా అదే విధంగా ఉత్తరు విచ్చాడు.

తన పంతం నెగ్గడంతోనే అతడు బాగా వెనక్కి తగ్గి భరించలేని అక్కసుతో, ఆయాసంతో రోజుకుంటూ నిలుచున్నాడు. పద్మస్వామి మంకణునివైపు గుడ్లురిమి చూసి, పళ్ళు పటపట కొరికి తన అధికారం అంతా ఒక్క గుక్కలో వెళ్ళగక్కాడు.

"ఏమి చూసుకుని ఇలాగ మిడిసిపడిపోతున్నావు? సరే, నీతల తిరుగుడు వ్యవహారం అంతా మహామంత్రుల సమక్షంలో నివేదిస్తానులే! ఆపైన ఆయన ఎదుటే నీ వీరావేశం వెల్లడించుకుందువుగానిలే!"

పైకెత్తిన గండ్రగొడ్డలి పక్కన పెట్టి మంకణుడు వెటకారంగా కలకల నవ్వాడు. "చెప్పుగోవయ్యా, ఎవరితో చెప్పుగుంటావోను. మహామంత్రి అయితేమాత్రం, నా తల కొట్టించి మొలవేయిస్తారా? మావంటి నిరుపేదల కొంపలు కూల్చి దేవాలయం కట్టి

స్తారా? ఆహా, ఇంతకాలానికి ఈ నేలమీద ఎటువంటి ధర్మప్రభువులు బయలుదేరారు?....ఎందుకింకా అలాగ నిలబడ్డావు! చాలు, చాలులే! నేర్చావు! వెళ్ళు! వెళ్ళు!"

మంకణు డా విధంగా మరింతగా రెచ్చిపోయేసరికి పద్మస్వామి కెంతగా ప్రయత్నించినా నోరు పెగలలేదు! గిరుక్కున వెనక్కి తిరిగి రాజభటులతోబాటు అక్కడినించి నిష్క్రమించాడు. మంకణునికి అంతటి మంకుపట్టు ఎందుకు కలిగిందో ప్రధాన రాజాధికారి కెంతగా ఆలోచించినా బోధపడలేదు. "గునపాలతో కొంచెం తవ్వించి తా నక్కడ కొలత లారంభించగానే, కళ్ళు మూసుకుని గంద్రగొడ్డలితో మీది కురకవలసినంతటి అగత్యం ఏమి వచ్చింది? దేవళం కట్టించడంకోసం తన గుడిసె తీసివేసినప్పుడు, మహామంత్రుల కా సంగతి నివేదిస్తే తగినంత నష్టపరిహారం కటాక్షించరా? ఎందుకలాగ ఎగిరెగిరిపడతాడు? ఏమి చూసుకుని ఆ తలబిరుసుతనం? సరే, ఆ పొగరంతా అణిగించివేస్తానుగా!"

అణిగించివేసుకున్న అహంకారావేశంతో మగ్గిపోయిన పద్మస్వామి అప్పుడేపోయి, ఆ వ్యవహారం అంతా మహామంత్రి శ్రుతకీర్తి దగ్గిర పూసగుచ్చినట్లు ఏకరువుపెట్టాడు. శీఘ్రమే ఆ చుట్టు గుడిసె నేలమట్టం చేయిస్తేనేగాని, మరి పని జరగదని నిష్కర్షగా చెప్పివేసి చేతులు దులుపుకున్నాడు. ఊరికే ఉత్త పుణ్యానికని మంకణుడు గంద్రగొడ్డలితో తనమీదికి, భటులమీదికి విరుచుకుపడ్డాడని వివరించి, నింద అంతా అతని నెత్తిమీదికి నెట్టివేశాడు!

మంకణు డలాగ కయ్యానికి కాలుదువ్వడాని కేమి కారణమో ఎంతసే పాలోచించినా శ్రుతకీర్తి కవగాహన కాలేదు! ప్రాణం విసిగి ప్రధాన రాజాధికారివైపు గుడ్లు ఉరిమి చూసి కసురుకున్నాడు.

"పోనీ, అతగాడికి రావలిసిన ఆ నష్టపరిహారమేదో ముందుగానే ముట్టజెప్పి పని ప్రారంభించలేకపోయారా? ప్రతి వ్యవహారము అనుక్షణము చెప్పి చేయిస్తేనేగాని మీరేది స్వయంగా చక్కబెట్టలేరా? ఎన్నెన్ని గొప్ప పదవులు నిర్వహిస్తే మాత్రం ఏమి లాభం, ఈమాత్రం చిన్నపని చెయ్యలేనప్పుడు?"

పద్మస్వామి బాగా కంగారుపడిపోయి చేతులు రెండు జోడించాడు.

"దేవాలయ నిర్మాణాని కనుకూలంగా ఆ ప్రాంతం అంతా కొలిచి, సుళువుబరువు తెలిగించవలిసిందని మాత్రమే మా కాజ్ఞ దయచేయించారు! ....అంతకన్న మా కధికారం లేదుగదా! ....అయినా తామేదో తగినంత నష్టపరిహారం ముట్టజెప్పించకపోరని నచ్చ జెప్పాను. అయినా లక్ష్యపెట్టకపోతే కొంచెం బెదిరించి చూశాను. ససేమిరా ఆ గుడిసె విడిచిపెట్టేది లేదన్నాడు. పైగా, గండ్రగొడ్డలి చేతబట్టి మామీద విరుచుకుపడ్డాడు. పోనీ, ఇకనయినా తగినంత ద్రవ్యంతో ఆశపెడితే దారికి వస్తాడేమో! కనుక్కుంటాను. సెలవా, మరి...."

శ్రుతకీర్తి ఇక అది ఒక్కటే తగిన మార్గమని ప్రోత్సహించాడు. నయాన, భయాన నచ్చజెప్పి ఎలాగో అలాగ పని సానుకూల పరుచుకుని రావలిసిందని, మోటుగామాత్రం వ్యవహరించవద్దని గట్టిగా హెచ్చరించాడు.

పద్మస్వామి ఆ మరునాడు ఉదయమే పోయి, కావలిసినంత సొమ్ము తీసుకుని ఆ గుడిసె విడిచి వేరొక చోటికెక్కడికయినా వెళ్ళవలిసినదని హితవుపదేశిస్తున్న ధోరణిలో మంకణుని బ్రతిమాలు కున్నాడు. కాని అతడు తన మొండిపట్టు విడిచిపెట్టలేదు. ఎంత సొమ్మిచ్చినా, చిట్టచివరికి ఏది ఎలాగ పరిణమించినా తా నా కుటీరం విడిచిపెట్టేదిలేదని కుండ బద్దలుకొట్టినట్టు నిక్కచ్చిగా చెప్పివేశాడు!

ఆ సంగతి విన్న మహామాత్యుని కేమి చెయ్యడానికి పాలు పోలేదు. పైగా, ఆ వ్యవహారం అంతా ఆమూలాగ్రంగా చక్రవర్తికి విన్నవించడంతక్క వేరొక్క గత్యంతరం లేదన్న భయం కూడా పట్టుకుని వేధించింది.

అదే సమయంలో దేవాలయ నిర్మాణం ఎంతవరకు వచ్చిందని ప్రశ్నించిన సార్వభౌముని కొకనాడు శ్రుతకీర్తి మంకణుని మొండి శిఖండి పట్టుదల అంతా చల్లచల్లగా నీళ్ళునములుతూ బయట పెట్టాడు.

చక్రవర్తి ఆ వ్యవహారం అంతా విని భగ్గుమని మండి పడ్డాడు.

"మొట్టమొదట మంకణుని కిది చెప్పి అతని ఇష్టం మీదనే పని ప్రారంభించలేకపోయారా? ఎంతటి పేదవాడయినా, కడజాతి వాడయినా ఆతని నా కుటీరం విడిచిపెట్టమని నిర్బంధించడానికి మన మెవరం? మనమే ఇలాగ దురన్యాయానికి ఒడిగడితే ఎలాగ?"

"మహాప్రభూ! తరవాత తగినంత సొమ్ము ముట్టజెప్పవచ్చు నన్న ఆలోచనతో, దానికి మంకణుడు అంగీకరించకపోతాడా అన్న ధైర్యంతో ప్రధానాధికారి తొందరపడి పని ప్రారంభినట్టున్నారు.... ఎందుచేతనో గాని ఆ మంకణు డిప్పుడు బాగా తాడుజారిపోయాడు ....పోనీ అనుకుంటే దేవళం కట్టడానికి అదే అన్నివిధాల తగిన ప్రదేశమని శిల్పులందరు ఏకగ్రీవంగా నిశ్చయించారు....మరి మార్గాంతరం లేక...."

శ్రుతకీర్తి నెమ్మదిగా నసుగుతూ దానిలో గల తప్పిదం చాలా వరకు ప్రధానాధికారిమీదికి నెట్టివేశాడు!

"అయితే ఇక ఆ దేవాలయ నిర్మాణంమాటే తలపెట్టకండి! ....అంతేనేకాని తప్పుడు పనులు మాత్రం చెయ్యకండి!"

చక్రవర్తి దురుసుగా ధుమధుమలాడుతూ సింహాసనంమీద నుండి దిగ్గున లేచి రాజభవనం లోపలికి వెళ్ళిపోయాడు!

ప్రధానమంత్రికి మరింతగా గాభరా పట్టుకుంది. మిగిలిన అమాత్యుల నందరిని వెంటనే సమావేశపరిచి, ఆ వ్యవహారం వారిముందుంచాడు. ఆ విషమసంధిలోనించి బయటపడే దారి ఏదయినా ఆలోచించవలిసినదని అర్థించాడు. వారిలో కొందరు తలలు పంకించి వ్యవహారం చెయ్యిదాటిపోయినదని ఆందోళన పడ్డారు. మంకణు డెలాగయినా ఒక్కసారి చక్రవర్తిని సందర్శించేటట్టు చెయ్యగలిగితే కొంత గుద్దిలో మెల్ల కావచ్చునని వారిలో ఒకరిద్దరు తమ ఆలోచన బయట పెట్టారు.

ఆ పరిస్థితిలో మహామాత్యుని కదే మంచిమార్గమని స్ఫురించింది. ఆ మరునాడే సార్వభౌముని సందర్శించి, ఆ పద్ధతి కంగీక

రించవలసిందని వేడుకున్నాడు. కొంత విసుగుదలతో వెలువడిన చంద్రాపీడుని అనుమతితో,"చక్రవర్తి నొకమారు సందర్శించిపోవలి సిన"దని ప్రధాన రాజాధికారిద్వారా సగౌరవంగా మంకణుని కొక సందేశం పంపించాడు.

* * *

మంకణుడు చాలా సామాన్య సంసారి. అయినా మిక్కిలి ఆత్మాభిమానం కల వ్యక్తి. తన కుటుంబమేమో! తానేమో! అంతేగాని ఒకరిజోలి, పొంటి అతని కక్కరలేదు. అలాగే ఇతరు లెవరయినా అనవసరంగా తన వ్యవహారాలలో కలగజేసుకుంటే అత డూరు కోడు. తన వృత్తివల్ల మంకణుని కెవ్వరిదగ్గిర తలవంచవలిసిన అవసరం లేకుండా జీవితం మర్యాదగా, సుఖంగా గడిచిపోతున్నది.

ఆ విధంగా మనుగడ కొనసాగించుకుంటున్న అతనికి, పద్మ స్వామి అకస్మాత్తుగా రాజభటులను వెంటబెట్టుకునివచ్చి, ఇంటి ముంగిట గునపాలతో తవ్వించి కొలత లారంభించడంతో దారుణ మయిన దురన్యాయం జరిగిపోయిన ట్లనిపించింది. అయితే తన బెది రింపులతో వారందరు నిష్క్రమించిన తరవాత ఆ బెడద అంతటితో వదిలిపోయిందిగదా అని ఒక వేడి నిట్టూర్పు విడిచిపెట్టాడు.

ఆపైన సార్వభౌములు తనతో సంప్రతించబోతున్నారన్న వార్త చెవిని పడగానే అతనికి చిరాకు తలకెక్కింది. బహుశః ఆయన తన కుటీరాన్నిగూర్చి సంప్రతించబోతున్నారనికూడా మంకణుడు ఊహించుకున్నాడు. అది అతని కిష్టంలేదు. అందుచేత ఏది ఏమయినా సరే, చక్రవర్తి సందర్శనానికి పోరాదని నిర్ణయించు కున్నాడు.

కాని సార్వభౌముడు మిక్కిలి ధర్మాత్ముడని, సజ్జనుడని అత డంతకుమునుపు చాలాసారులు కర్ణాకర్ణిగా విన్నాడు. అందువల్ల పద్మస్వామి, రాజభటులు తనఎడల ఎంతటి దురహంకారంతో దారు ణంగా ప్రవర్తించినా దర్శనానికే పోకపోవడం మర్యాదకాదేమో అని పించింది. కనక అతని కంతగా ఇష్టం లేకపోయినా ఆ మరునాటి ఉదయమే సార్వభౌముని సందర్శనానికి పోక తప్పలేదు.

కొలువుకూటానికి అల్లంతదూరంలో ఉండగానే రాజసేవకు డొకడు మంకణుని వేరొక సభామందిరానికి వెంటబెట్టుకునిపోయాడు. రాజాస్థానంలో అడుగుపెట్టడానికి తన కర్హత లేకపోవడంవల్లనే అధికారులు వేరొక సభామంటపంలో తన దర్శనం ఏర్పాటుచేస్తున్నా రని మంకణుడు క్షణంలో పసికట్టివేశాడు. ఆ కొంగ్రొత్త అవమాన భారంతో అత డెంతయినా కుంగిపోయాడు. వెనువెంటనే తిరిగి వెళ్ళిపోవాలనికూడా సంకల్పించుకున్నాడు. కాని తొందరపడడాని కది తగిన అదను కాదని మిక్కిలి అణకువతో చేతులు కట్టుకుని నిలు చున్నాడు.

చక్రవర్తి ఆ సభాగారంలో అడుగుపెట్టి, సింహాసనంపై కూర్చుంటూనే రెప్పవాల్చక రెండుమూడు క్షణాలపాటు మంకణుని ముఖభంగిమ నిశితంగా పరిశీలించాడు.

"మంకణా, తగినంత సొమ్ము ముట్టజెప్పగలనని మా ప్రధా నాధికారి మాట ఇచ్చినా, త్రిభువనస్వామి దేవాలయ నిర్మాణానికి నీ వెందు కిలాగ అడ్డు తగులుతున్నావు? ఎందుకు నీ కింత పట్టుదల....!"

మంకణుడు రవంతసేపు తటపటాయించాడు. కాని కొంచె మయినా భయపడలేదు.

"సార్వభౌమా, తాము మహైశ్వర్యవంతులు! మీతో సరి పోల్చుకున్నప్పుడు మేము వట్టి నిరుపేదలమే! నవరత్నాలహారాలు ధరిస్తున్నారు మీరు! మేము వట్టి నల్ల పూసలపేరులతోనే సరిపుచ్చు కుంటున్నాము. అయినా దేహాభిమానము, ఆత్మాభిమానము మీకు, మాకు సమానంగానే ఉంటున్నాయి గదా!....మీ ప్రధానాధికారి దురా గతాలు మీ కింతకుమునుపే తెలిసి ఉండవచ్చును. అతని కంతటి దురహంకారమేల? మాపై అంతటి ఈసడింపేల? తమ అధికారుల కిది ధర్మమేనా?"

సార్వభౌము డతని ధోరణి గ్రహించుకుని నెమ్మదిగా నచ్చ జెప్పాడు.

"నీవన్నది నిజమే....తగినంత సొమ్ము ముట్టచెప్పినప్పుడు

నీ చుట్టుగుడిసె ఇవ్వకపోతావా? అని ఆలోచించి కొంచెం తొందర పడిఉంటాడు. ముందుగానే నీతో ఆ సంగతి సంప్రతించి ఉండవలసి నది. ఆ తొందర తప్పే. అయితే త్వరితంగా దేవళం నిర్మించవలసి ఉందని మే మాజ్ఞాపించాము. అదీగాక అంతకన్న మంచి చోటేది దొరకలేదు! అయితే తగినంత సొమ్ము తీసుకో! దానికేమి? అనవస రంగా దైవకార్యానికి అడ్డుపడకు."

అయినా మంకణు డంగీకరించలేదు.

"మా తాతముత్తాల కాలంనించి మే మదే కుటీరంలో జన్మిం చాము. నా పసిపిల్లలందరు అక్కడే మొట్టమొదటగా కళ్ళు తెరిచారు. ఆ చుట్టుగుడిసె మా కష్టసుఖా లన్నిటిలోను ఆదుకుని కనిపెట్టి చూస్తు న్నది. జననిఅయినా, జన్మభూమిఅయినా మావంటివారి కదే కదా! అటువంటి కన్నతల్లిని విడిచి ప్రాణాలతో నే నింకొకచోటికి బయలు దేరగలనా?.... వేత్తలయిన తమవంటివారి కింక నే నేమని విన్న వించుకోగలను?"

చంద్రాపీడుని కింకొక మార్గాంతరమేది కనుచూపు మేరలో గోచరించలేదు. లోలోపల కొంచెం చిరాకు బయలుదేరింది. పద్మ స్వామి దురుసుతనంవల్లనే తన కంతటి ఇబ్బంది కలుగుతున్నదని మనస్సులో అతనిమీద విసుక్కున్నాడు. తిరిగి చల్లని తేటచిరు నవ్వుతో ప్రోత్సాహించాడు.

"మంకణా, నీవన్నది యథార్థమే! కాదనడంలేదు. నిజానికి కన్నతల్లికన్న పుట్టినచోటే గొప్పది!....అయితే ఇంకొక్కమాట. ఎంత సొమ్ము కోరినా, ఏది కోరినా నే నసుగ్రహిస్తున్నాను. నేనిచ్చే ధనరాశితో కావలిస్తే నీ వింకొకచోట ఒక పెద్ద మేడ కట్టుకోవచ్చును గదా! పద్మస్వామి తొందరపడినంతమాత్రాన ఎందుకు నీకింత పట్టు దల? నా మాట కాదనక కొంచెం ఆలోచించుకో!"

కాని మంకణు డంతటితో ఉబ్బి తబ్బిబ్బయిపోలేదు. నేల వైపు చూస్తూ మాట్లాడక కూరుకున్నాడు.

చక్రవర్తి తిరిగి బుజ్జగించాడు.

"ఏమి మంకణా, మాట్లాడవు? ఎందుకు నీ కింతటి

సంకోచం? మనస్సులో ఉన్నదేదో బయటపెట్టరాదా?"

"ధర్మమూర్తులు తమరు! అన్నమాట తప్పకూడదు మరి! నేనేది కోరినా కటాక్షించాలి!"

"అలాగే! నే నెప్పు డయినా అన్న మాట తప్పినట్టు విన్నావా?...."

"సార్వభౌమా! ప్రత్యేకించి మీ పనికోసమే నన్నిక్కడికి పిలిపించారు. ఆపైన కొలువుకూటంలోకాక, వేరొక్కచోట నిలబెట్టి ప్రసంగం కొనసాగిస్తున్నారు. ఇదెక్కడి మర్యాద? తమ కిది ధర్మమేనా? ముమ్మందుగా తమ రొక్కమారు మా కుటీరానికి విజయం చేసి, అక్కడే ఈ వ్యవహారం ప్రస్తావించాలి. ఇదే నా కోరిక!"

మంకణుని పట్టుదల అంతరార్థం చక్రవర్తి కప్పటికి కొంత వరకు బోధపడింది. అతనిని తన సందర్శనానికి పిలిపించినప్పుడు అధికారులు చేసిన పొరపాటుకూడా అప్పుడు స్ఫురించింది. అయితే ఏదో అలవాటు ప్రకారం వా రలాగ ఏర్పరిచిఉంటారని సరిపెట్టుకున్నాడు. ఇక మంకణుని కుటీరానికిపోయి, ఆ వ్యవహారం ప్రస్తావించగానే వెనకటి పొరపాటు విస్మరించి, దేవాలయం నిర్మాణానికే విధమయిన అడ్డంకి కలిగించడన్న ధైర్యం కలిగింది. అయినా అతని నోట ఆ మాట రాబట్టడం మంచిదనుకున్నాడు.

"దానికేమి! నీ కోరిక కాదనడంలేదు. కాని, ఆపైన దేవళం కట్టించడానికిమాత్రం మరి అడ్డు చెప్పకూడదు సుమా!"

అంతలోనే మంకణు డందుకున్నాడు.

"తాము నా కుటీరానికి విజయంచేసి ఈ విషయం తిరిగి ప్రస్తావించిన తరవాతేకదా ఆ ప్రశ్న! అప్పుడు నా కిష్టసుఖాలేవో నే నాలోచించుకుంటాను. అంతేగాని ముమ్మందుగా నే నిప్పు డే మాట ఇవ్వడంలేదు. ఆపైన తమ చిత్తం!"

మంకణు డేదోవిధంగా మెలతపెట్టి పద్మస్వామి మీద, శ్రుతకీర్తిమీద, తనమీద పేరుకున్న అక్కసంతా ఆవిధంగా తీర్చుకుంటున్నాడని సార్వభౌమునికనిపించింది. అయినా అతని ఆత్మాభిమానం మీద, పట్టుదలమీద చక్రవర్తి హృదయంలో కొంత గౌరవం కల

గకపోలేదు. అదీగాక వేరొక గత్యంతరంకూడా కనబడలేదు. అతని కుటీరానికి పోయి అడిగినప్పు డిక మారుమాట చెప్పదని అను కున్నాడు. కనక మరునాటి సాయంకాలమే విచ్చేయగలనని మాట ఇచ్చి సముచిత గౌరవంతో వీడ్కొన్నాడు.

* * *

మంకణుని చుట్టుగుడిసెలోనికి చంద్రాపీడ చక్రవర్తి విజయం చేస్తున్నారన్న వార్త అతని కుటీరప్రాంతంలోనేకాక, శ్రీనగరంలో అంతట ఝంఝూమారుతవేగంతో వ్యాపించింది. అతని బంధువులు, మిత్రులు ఆ వృత్తాంతం విని పరమానందభరితు లయినారు. కాని వారిలో కొందరు సార్వభౌము లంతటివారు నోరు విడిచి అడిగి నప్పుడు దేవళం కట్టటానికి వెంటనే అంగీకరించకపోవడం పట్టి మూర్ఖత్వమే అని ఈసడించుకున్నారు. మంత్రులు కొందరు పద్మ స్వామివల్లనే ఇంతటి బెడద వచ్చిపడిందని అతనిమీద దుమ్మెత్తి పోశారు.

ఇంతకి చక్రవర్తి స్వయంగా తన కుటీరానికి విచ్చేసి అర్థిం చినా మంకణు డది స్వాధీనం చెయ్యడేమో అని శ్రుతకీర్తి ఎంత యినా ఆందోళనపడ్డాడు. ఆ సాకుతో కాశ్మీరాధిపతిని తన కుటీరానికి ఆహ్వానించి, అది స్వాధీనం చెయ్యటోవడంలేదని నిష్కర్షగా చెప్పి వేసి అవమానించడమే అతని ఉద్దేశ్యమయి ఉండవచ్చునని కూడా ప్రధానమంత్రి భయపడ్డాడు. కాని అంతవరకు వచ్చినప్పుడు అప్పటి మాట ఆలోచించుకోవచ్చునని తిరిగి తనలో సమాధానపడ్డారు.

తా నిచ్చిన వాగ్దానం ప్రకారం మరునాటి సాయంకాలం చంద్రాపీడ చక్రవర్తి ఒంటరిగా, కేవలం పాదచారిగా మంకణుని కుటీరానికి బయలుదేరాడు. ఆ అపూర్వ సంఘటన గమనించిన మంకణుని ఇరుగు పొరుగులతోబాటు ఇంచుమించుగా శ్రీనగర పౌరులందరు అతని చుట్టుగుడిసెచుట్టు గుమిగూడారు. చక్రవర్తినే ఆ విధంగా తన కుటీరానికి రప్పించుకుంటున్న మంకణునిమీద వారిలో కొందరి కెంతయినా క్రోధం బయలుదేరింది. దానితోబాటు చంద్రాపీడునిపై మరింత గౌరవభావం పెంపొందింది. చిట్టచివరికి శ

వ్యవహారం అంతా ఏవిధంగా పరిణమించగలదో అన్న తహతహ వారందరిని ఉక్కిరిబిక్కిరి చేసింది.

సార్వభౌమునికోసమని మంకణుడు తన తలకు మించిన మహారాజమర్యాదలేవీ తలపెట్టలేదు. ఆయన తన వాకిట అడుగుపెట్ట గానే ఎంతో గౌరవంతో ఎదురుగా పోయి, తనకున్న ఈతాకులచాప మీదనే కూర్చుండబెట్టాడు. తనపెరటిబావి చల్లని మంచినీళ్లే తియ్యని శీతలపానీయంగా ఒక మట్టిపాత్రలో పోసి చేతి కందించాడు. తన ఇంటి ముంగిట పూసిన నీలిగోరింట పూల మాల మెడలోవేసి, భూర్జ పత్రాల విసనకర్రతో విసురుతూ అంత శ్రమపడి తన కుటీరానికి విచ్చేసినందుకు ప్రగాఢ కృతజ్ఞత వెల్లడించాడు.

చక్రవర్తి అతని చుట్టుగుడిసె అంతా కలయజూచి, కుశల ప్రశ్నతో ప్రసంగం ప్రారంభించాడు. కావలసినంత సొమ్ము తీసు కుని, దేవళం నిర్మించడానికి అనువుగా శీఘ్రమే సకుటుంబంగా వేరొక్కచోటి కెక్కడికైనా వెళ్ళిపోవలసిందని తిరిగి ఎంతో మర్యాదగా తన కోరిక వెల్లడించాడు.

మంకణుని పెదవులపై సంపూర్ణ సంతృప్తితో ఘనీభవించిన దరహాసితం తరళించింది.

"సార్వభౌమా! తాము స్వయంగా విజయంచేసి పునీతం చేసి నందువల్ల నా కుటీరం మరింతగా అమూల్యమై నా కపూర్వాహ్లాదం కలిగిస్తున్నది! తామెంత సొమ్మిచ్చినా నేనిక దీనిని విడిచిపెట్టలేను. అయితే, ఒక్కమాట! తమకెంతో శ్రమ కలిగించినందుకు మాత్రం మన్నించవలసిందని వేడుకుంటున్నాను!"

'తాను వింటున్నది యథార్థమేనా?' అన్న సంశయంతో, ఆశ్చర్యంతో, పట్టరాని తలవంపుతో కాశ్మీర చక్రవర్తి నిర్ఘాంతపడి ప్రశ్నించాడు.

"మంకణా, నీ వీ మాట మర్యాదకోసమని అనడం లేదు గదా?....నిజంగా ఇది నీ నిశ్చయమేనా?"

"ముమ్మాటికీ ఇది నా నిశ్చయమే! మీరు నా చుట్టుగుడిసె ఎత్తు పైడిదీనారాల రాశి నాముందు పోసినా నే నిది విడిచిపెట్టదలుచు కోలేదు! మరి ఈ సంగతి ఇంత ప్రస్తావించవద్దని వేడు కుంటున్నాను."

మంకణు డత్యంత వినయంతోనే తన దృఢ నిశ్చయం నిస్సందేహంగా వెల్లడించాడు.

చక్రవర్తికి ముచ్చెమటలు పోశాయి.

"నాకు ముందుగానే కొంత అనుమానం కలిగింది, నీ విలాగ ఇంటికి పిలిపించి తిరస్కరించగలవేమో అని. అయినా నేను ధర్మ ప్రకారం నా విధి నిర్వర్తించుకున్నాను. సరే, ఇక ధర్మకార్యార్థమై తగినంత ప్రతిఫలంమాత్రమే ఇచ్చి నీ కుటీరం బలాత్కారంగా స్వాధీనం చేసుకుంటున్నాను! ....ఇక దీనిలో అన్యాయమేమిలేదు! తెలిసిందా?.....ఒడిలో పడనున్న ధనరాశి అనవసరంగా జారవిడుచు కోకు! ఆవేశం విడిచి ఆలోచించుకో!"

సార్వభౌముని గొంతు పెచ్చుపెరిగిపోతున్న ఆగ్రహావేశంతో రవంత వణికింది. అయినా మంకణు డధైర్యపడలేదు.

"మహాప్రభూ! మీ రెంతటి బలవంతులయినా నా గొంతులో ఊపిరి ఉన్నంతవరకు మీ కిది స్వాయత్తం కానేరదు! మీ భటు లిక్కడ అడుగు పెట్టగానే దీనికి నిప్పంటించి నేను నా పసిపిల్లలతో, భార్యతోబాటు అగ్నిజ్వాలలో పడి మరణించగలను! ....ఈ సంగతి మున్ముందుగానే మీ కెరిగిస్తున్నాను. మీ కిది న్యాయమనిపిస్తే ఆపైన మీ అధికారంతో నా కుటీరం స్వాధీనం చేసుకోవచ్చును! దానికేమి!...."

మరికొన్ని క్షణాల వరకు చంద్రాపీడుని నోట మాట వెలువడ లేదు!

"మంకణా, ఇంతేనా నీ తుది నిర్ణయము? అనవసరంగా పసి

పిల్లలతో, భార్యతో అగ్నిజ్వాల కెందుకు ఆహుతి అయిపోతావు? అది మంచిపని కాదు సుమా?....నన్నిక తరలిపొమ్మన్నావా? లేక ఇంతకన్న వేరేమాట ఏదయినా ఉన్నదా?"

"ఇదే నా తుది నిశ్చయము, మహారాజా! నేను చెప్పవలిసిన దేది లేదు!"

మంకణుని గొంతు ఖంగుమని మారుమోగింది. చక్రవర్తి లేచి నిలుచుని నాలుగైదు క్షణాలపాటు మంకణుని ధోరణి పరీక్షించాడు. నెమ్మదిగా అతనిని సమీపించి ఎంతో ఆప్యాయతతో చేతులు రెండు పట్టుకుని ఆ వ్యవహారంలో తన అంతిమ నిర్ణయం ప్రకటించాడు.

"మంకణా, అపూర్వమయిన నీ ఆత్మగౌరవము, అచంచల ధైర్యము నా కమందానందం కలిగించాయి! పండువంటి నీ సంసారం బుగ్గిచేసి నేనిక ఈ దేవళం నిర్మించదలచుకోలేదు. ఇంతేకాదు! ఇందువల్ల నీ ఎడల నా కేవిధమయిన వైమనస్యము కలగడంలేదు. పైగా, పరమ గౌరవభావం పెంపొందుతున్నది. పిల్లలతో, పాపలతో నీ విక్కడే నివసిస్తూ కలకాలం సుఖించువుగాక! ఇదిగో, నే నిక తరలిపోతున్నాను."

అయిదారు అడుగులు వేసి ఆ కుటీర ద్వారంవైపు సాగిపోయాడు చక్రవర్తి. మంకణు డాధర్మమూర్తి న్యాయధోరణి గమనించి పట్టరాని ఆశ్చర్యంతో నిశ్చేష్టితుడయినాడు! మరుక్షణంలోనే పాదాలపై వాలిపోయాడు! నెమ్మదిగా లేచి నిలిచి చేతులు రెండు పట్టుకుని విన్నవించాడు.

"మహారాజా! దయఉంచి నా మనవి రవంత చిత్తగించండి! నే నింతకుముందు అనేక పర్యాయాలు మీరు మహాధర్మస్వరూపు లన్న ఖ్యాగత్త విన్నాను. ఆ ప్రశంసలోగల పరమార్థ మెంతటిదో పరీక్షించవలె నన్న పట్టుదలతోనే నే నిన్నివిధాల మీ కోరిక మాటిమాటికి నాపేమిరా అని తిరస్కరించాను.

"అంతేగాని మీ దేవాలయ నిర్మాణాని కడ్డుపడవలెనని నే నెన్నడు తలపెట్టలేదు. ఇదిగో, నా కుటీరంతోబాటు దీనిచుట్టుగల నేల అంతా మీ కిప్పుడే స్వాధీనం చేస్తున్నాను. దయఉంచి నా ప్రార్థన మన్నించి స్వీకరించండి!"

అకస్మాత్తుగా మారిన మంకణుని ధోరణితో చక్రవర్తి మరింతగా విభ్రాంతపడ్డాడు! కానిఅంతలోనే అతని ఆంతర్యంగ్రహించు కుని తిరిగి ఆత్మీయదృష్టితో అభినందించాడు. క్షణకాలం మౌనం వహించి, "అయితే నన్ను పరీక్షించవలెనన్న పట్టుదల నీ కెందువల్ల కలిగింది, మంకణా?" అని సాదరదృష్టితో ప్రశ్నించాడు.

"మహాప్రభూ, తాము నిర్మించదలుచుకున్నది త్రిభువనస్వామి దేవాలయమేగాని ఏదో సామాన్యమయిన దేవళం కాదుగదా! ఆ స్వామికి అందరి ఎడల సమానమయిన కారుణ్యమేగాని పక్షపాత మేమాత్రము లేదుకదా! కాని ఆ దేవళం నిర్మించదలచుకున్న మీ అధి కారులందరు మొట్టమొదటినించి కేవలం పక్షపాత దృష్టితోనే వ్యవ హరించారు. నన్ననేకవిధాల ఈసడించి, అవమానించారు! మీ సం దర్శనానికి వచ్చినప్పుడుకూడా నా కదేవిధమయిన అమర్యాద జరి గింది. దీని కెవ్వరు కారణభూతులో మొట్టమొదట నా కవగాహన కాలేదు. కనకనే నే నింతటి మొండిపట్టుదలతో వ్యవహరించ వలసిన ఆవశ్యకత కలిగింది. అంతేగాని నా కింకొక ఆలోచనే లేదు!

"ఇంకొక్క మనవి. నా కుటీర ప్రాంతంలోనే త్రిభువన స్వామి దేవాలయ నిర్మాణం జరగబోతున్నది. అటువంటప్పుడు ఆ కరుణాసాగరుని సందర్శనంలో, పూజాదులలో పక్షపాతం పనికి రాదు కదా? తాము న్యాయస్వరూపులని నాకు తెలియకపోలేదు. అయితే మీ అధికారు లొక్కొక్కప్పుడు తమ ఇష్టం వచ్చినట్టు వ్యవ హరించవచ్చును. కనకనే నే నింతగా విన్నవించుకుంటున్నాను."

ఆ హెచ్చరికలోగల అంతరార్థంచక్రవర్తి క్షణంలో గ్రహిం

చుకున్నాడు. తన సందర్శనంలోగాని. త్రిభువనస్వామి సందర్శనంలో గాని. పూజాదులలోగాని ఇకముం దెన్నడు. ఎవ్వరికి ఎటువంటి అమర్యాద. అన్యాయము జరగబోవని ఖచ్చితంగా వాగ్దానంచేసి ఇను మడించిన గౌరవప్రసంగంతో మంకణుని వీడ్కొన్నాడు.

అంతలోనే కర్ణాకర్ణిగా ఆ శుభవార్త విన్న శ్రీనగర పౌరులు జయజయాభినందనలతో చంద్రాపీడ చక్రవర్తి ననేక విధాల ప్రశం సించారు.

ఆపైన ముమ్మందుగా మంకణుని కింకొకచోట పెద్ద సౌధం నిర్మించిఇచ్చిన అనంతరమే ఆకాశం చుంబించే గోపుర ప్రాకారాలతో త్రిభువనస్వామి దేవాలయ నిర్మాణం ముగిసింది.

మంకణునివల్లనే అపార కరుణామూర్తి ఆ స్వామిని యథే చ్ఛగా సందర్శించి. మనసారా అర్చించగల మహాదృష్టం తమ కంద రికీ లభించినదని ఆ ప్రాంతంలోగల పౌరులేకాక. శ్రీనగరవాసులం దరు ఆతనిని వేనోళ్ళ వినుతించి అభినందించారు.

---